RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:107 | ఏప్రిల్ 12, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



## రేవంత్ రెడ్డి అహంకారానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- ఫోర్త్ సిటీ పేరుతో భూముల దందా..
- అధికారులు అక్రమాలకు పాల్పడితే వదిలే ప్రసక్తే లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో

## ఈ కడుపుకోతకు.. కన్నీళ్లకు.. ఘోరాలకు బాధ్యులెవరు??




వరంగల్ జిల్లాలో గ్యాంగ్ రేపునకు గురై ఫ్యాన్‌కు ఉరివేసి చంపబడ్డ గిరిజన యువతి.., గుండెల నిండా బాధతో నిందితులను వదలొద్దని చెబుతున్న కుటుంబ సభ్యురాలు

మేడ్చల్ జిల్లాలో పెళ్లికి నిరాకరించిందని ఓ ఉన్మాది ఎయిడ్స్ రక్తం ఎక్కించడంతో ఆత్మహత్య చేసుకున్న యువతి.. గుండెలవిసేలా రోదిస్తున్న తల్లి..

ఓ కిరాతకుడు న్యూడ్ ఫొటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానని బెదిరించడంతో చేతిపై 'నాన్న' అని రాసుకుని మరీ ఆత్మహత్య చేసుకున్న యువతి.. గుండెలు పగలేలా రోదిస్తున్న తండ్రి

### రెచ్చిపోతున్న మానవ మృగాళ్లు!

### ఆగని ఉన్మాదుల ఆగడాలు!!



2లో

# సమాజమా తలదించుకో..!

### సభ్య సమాజం సిగ్గుపడేలా వరుస ఘటనలు

- వరంగల్‌లో గంజాయి బ్యాచ్ ఘాతుకం
- గిరిజన యువతిపై గ్యాంగ్ రేప్.. ఉరివేసి హత్య
- మేడ్చల్‌లో ప్రేమోన్మాది వికృత చేష్ట
- పెళ్లికి నిరాకరించిందని యువతికి ఎయిడ్స్ రక్తం ఎక్కించిన కిరాతకుడు
- ఏపీలో న్యూడ్ ఫొటోలతో వేధించిన నీచుడు..
- మనస్తాపంతో ప్రైవేట్ టీచర్ ఆత్మహత్య
- చట్టాలు కఠినంగా ఉన్నా మారని నీచుల ప్రవృత్తి

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

సాంకేతికంగా ఎంత ఎదిగినా.. నాగరిక సమాజం తలదించుకునేలా తెలుగు రాష్ట్రాల్లో వరుస అఘాయిత్యాలు కలకలం రేపుతున్నాయి. వరంగల్‌లో గంజాయి బ్యాచ్ సాగించిన సామూహిక అత్యాచారం, మేడ్చల్‌లో ప్రతీకారంతో యువతికి ఎయిడ్స్ రక్తం ఎక్కించిన ఉన్మాదం, ప్రకాశం జిల్లాలో బ్లాక్ మెయిలింగ్‌కు బలైన టీచర్ ఉదంతం... ఈ మూడు ఘటనలు చూస్తుంటే మనం మనుషుల మధ్య ఉన్నామా లేక మృగాల మధ్య బతుకుతున్నామా అన్న భయం కలగక మానదు. ఎన్ని చట్టాలు తెచ్చినా, ఎంత నిఘా పెట్టినా ఆగని ఈ ఉన్మాదానికి అడ్డుకట్ట పడేది ఎప్పుడు? ఆడబిడ్డలకు ఈ సమాజంలో రక్షణ ఎక్కడ? అనే ప్రశ్నలను లేవనెత్తుతున్న తాజా దారుణాలపై 'వేద న్యూస్' ప్రత్యేక కథనం..



## జాగృతి బీసీల కోసం పని చేస్తుంది

- పూలే మళ్లీ పుట్టాడా అనే స్థాయిలో..
- బీసీ ఉప కోటా కోసం కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమం చేద్దాం
- సాధించేవరకూ పోరాటం కొనసాగిద్దాం..
- జాగృతి అధ్యక్షురాలు కవిత

2లో

## కేసీఆర్ సభకు ఏర్పాట్లు

2లో



## ఏప్రిల్‌లోనే.. మే ఎండలు!

- తెలంగాణలో నిప్పులు కురిపిస్తున్న భానుడు
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు
- 41-42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- వడదెబ్బ నుంచి రక్షణకు జాగ్రత్తలు సూచించిన అధికారులు

2లో

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. గత నెల నుంచే భానుడు మండిపోతుండగా, ఏప్రిల్‌లోనే మే నెల వాతావరణాన్ని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచే ఉక్కపోత, మధ్యాహ్నం

మిగతా 2వ పేజీలో

## పూలే సేవలు చిరస్మరణీయం

- సమానత్వం, విద్యా విస్తరణకు ఎంతో కృషి
- ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలి
- పూలే జయంతి సందర్భంగా రేవంత్ రెడ్డి
- మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం

2లో



## రేవంత్ రెడ్డి అహంకారానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- ఫోర్త్ సిటీ పేరుతో భూముల దందా..
- అధికారులు అక్రమాలకు పాల్పడితే వదిలే ప్రసక్తే లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న అప్రజాస్వామిక విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, రేవంత్ రెడ్డి తన అహంకారంతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదవాళ్ల భూములను అరాచకంగా గుంజుకుంటున్న రేవంత్ రెడ్డి, తెలంగాణ చరిత్రలో ఒక చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మరియు క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ సాధించిన విజయంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో అక్రమాలకు పాల్పడి, చైర్మన్ పదవులను అన్యాయంగా దక్కించుకోవాలని చూసినా, చివరికి న్యాయమే గెలిచిందని ఆయన పేర్కొన్నారు. మెజారిటీ కౌన్సిలర్ల మద్దతుతో గులాబీ జెండా ఎగిరిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలిచిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లను కేటీఆర్ సన్మానించారు. స్థానిక ఎమ్మెల్యే అరాచకాలను ఎదిరించి నిలబడిన యువ నాయకుడు ప్రశాంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మొండితనం ఉన్న నాయకత్వం ఉంటే ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని ఈ విజయం నిరూపించిందన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ఫోర్త్ సిటీ అనేది ఒక పెద్ద డ్రామా అని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు అదే భూముల్లో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ కడతామని నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కేవలం తన కుటుంబ సభ్యులకు, అనుచరులకు భూములు కట్టబెట్టడం కోసమే రేవంత్ రెడ్డి ఈ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. ఉన్న సిటీలో దోమల వల్ల జనం చనిపోతుంటే పట్టించుకోని ముఖ్యమంత్రి, ఫ్యూచర్ సిటీ కడతాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోహెడలోని పండ్ల మార్కెట్ భూములను కూడా అమ్ముకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ దుయ్యబట్టారు.

## ఏప్రిల్‌లోనే.. మే ఎండలు!

**మొదటి పేజీ తరువాయి**

వడగాల్పులతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర గరిష్ఠ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. రాబోయే 4 నుంచి 5 రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్ నగర్ జిల్లాలో 41 డిగ్రీలు, ఖమ్మంలో 40 డిగ్రీలు నమోదయ్యాయి. ఉత్తర తెలంగాణలో కూడా 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్ నగరంలో కూడా 39 డిగ్రీల ఉష్ణోగ్రత కొనసాగుతోంది. ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట, మహబూబ్ నగర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో 41 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఈ ఎండలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటల తర్వాతే రహదారులు వెలవెలబోతున్నాయి. ప్రజలు అత్యవసర పనులు తప్ప బయటకు రావడాన్ని తగ్గిస్తున్నారు. వడదెబ్బల నుంచి రక్షణ కోసం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకుండా ఉండాలని అధికారులు సూచించారు. మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవాలను ఎక్కువగా తీసుకోవాలని, తరచుగా నీరు తాగాలని సూచించారు. తలనొప్పి, తల తిరగడం, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని హెచ్చరించారు.

# సమాజమా తలదించుకో..!

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

మనం 21వ శతాబ్దంలో ఉన్నామని, సాంకేతికంగా ఎంతో ఎదిగామని గర్వంగా చెప్పుకుంటున్నాం. కానీ, అదే సమాజంలో ఆడబిడ్డలకు రక్షణ కరువవుతోంది. కామంతో కళ్లు మూసుకుపోయిన మృగాళ్లు కొందరైతే, పగ ప్రతీకారాలతో పైశాచికత్వం ప్రదర్శించే ఉన్మాదులు మరికొందరు. సమాజం తలదించుకునేలా వరుసగా జరుగుతున్న హృదయ విదారక ఘటనలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపుతున్నాయి. పోలీసులు ఎంత నిఘా ఏర్పాటు చేసినా, చట్టాలు ఎంత కఠినంగా మారుతున్నా.. మృగాళ్లలో మాత్రం మార్పు రావడం లేదు. కామంతో కళ్లు మూసుకుపోయిన కొందరు, వికృత చేష్టలతో ఉన్మాదులుగా మారిన మరికొందరు పసిపిల్లల నుంచి పండు ముసలి వరకు ఎవరినీ వదలడం లేదు. ఈ క్రమంలో ఇటీవల వెలుగు చూసిన కొన్ని సంఘటనలు నాగరిక సమాజాన్ని నివ్వెరపరుస్తున్నాయి. వరంగల్, మేడ్చల్, ప్రకాశం జిల్లాల్లో జరిగిన మూడు వేర్వేరు ఘటనలు చూస్తుంటే, అసలు మనం మనుషుల మధ్యే జీవిస్తున్నామా? లేక మృగాల మధ్యనా? అనే సందేహం కలుగక మానదు.




### వరంగల్లో గంజాయి బ్యాచ్ బరితెగింపు

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఏకే తండాకు చెందిన 21 ఏళ్ల గిరిజన యువతి ఉదంతం అత్యంత హృదయ విదారకం. పర్వతగిరి రావూరు తండాకు చెందిన నలుగురు యువకులు గంజాయి మత్తులో సాగించిన ఈ క్రూరత్వం నాగరిక లోకాన్ని నివ్వెరపోయేలా చేసింది. నిందితులు ఆ యువతిని కిడ్నాప్ చేసి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి పొలాల్లో సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అంతటితో ఆగక, తమ నేరం ఎక్కడ బయటపడుతుందో అన్న భయంతో ఆమెను ఉరివేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు యువతను ఎంతటి ఘోరాలకు పురిగొల్పుతాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్న ఈ మృగాళ్లకు కఠిన శిక్ష పడాల్సిందేనని బాధితురాలి కుటుంబం కన్నీటి పర్యంతమవుతోంది.

### పైశాచిక ప్రతీకారం.. ఇంజెక్షన్ తో ఎయిడ్స్ రక్తం

మరోవైపు మేడ్చల్ జిల్లాలో జరిగిన ఘటన వింటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. ప్రేమ పేరుతో వేధించిన మనోహర్ అనే ఉన్మాది, పెళ్లికి నిరాకరించిందన్న కోపంతో ఒక యువతిపై అత్యంత భయంకరమైన ప్రతీకారాన్ని తీర్చుకున్నాడు. ల్యాబ్ టెక్నీషియన్ సహాయంతో హెచ్ఐవీ సోకిన రక్తాన్ని సేకరించి, బహుమతి ఇస్తానని నమ్మించి ఆమె కళ్లకు గంతలు కట్టి ఆ రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించాడు. ఆ తర్వాత తనకు ప్రాణాంతక వ్యాధి సోకిందని తెలిసిన బాధితురాలు, సమాజంలో తలెత్తుకోలేక, ఆ వేదనను తట్టుకోలేక ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. నిందితుడు జైలుకు వెళ్లినా, ఆ యువతి ప్రాణం తిరిగి రాలేదు. ప్రేమ అంటే ప్రాణం ఇవ్వడం కాదు, ప్రాణం తీయడం అనే వికృత పోకడలకు ఈ ఘటన అద్దం పడుతోంది.

### బ్లాక్ మెయిలింగ్‌కి బలైన టీచర్

ఆంధ్రప్రదేశ్‌లోని పామూరు మండలం అయ్యగారిపల్లిలో జరిగిన మరో ఘటన సోషల్ మీడియా దుర్వినియోగానికి పరాకాష్ట. నాగూరు బాషా అనే నిందితుడు ఒక ప్రైవేట్ టీచర్‌ను తన మాటలతో ట్రాప్ చేసి, ఆమె నగ్న చిత్రాలను సేకరించాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తూ మానసికంగా క్షోభకు గురిచేశాడు. తను చెప్పినట్లు వినకపోతే పరువు తీస్తానని వేధించడంతో, ఆ యువతి భరించలేక బలవన్మరణానికి పాల్పడింది. తన కళ్ల ముందే ఎదగాల్సిన బిడ్డ విగతజీవిగా పడి ఉండటం చూసి ఆ తండ్రి పడుతున్న వేదన వర్ణనాతీతం.

### చట్టాలు కఠినం కావాలి.. నిఘా పెరగాలి

ఈ ఘటనలు గమనిస్తే, నిందితుల్లో చట్టం పట్ల భయం లేదని స్పష్టమవుతోంది. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, చట్టాల్లో ఉన్న లొసుగులు మృగాలకు వరంగా మారుతున్నాయి. నిర్భయ, దిశ వంటి చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా, నేరం జరిగిన తక్కువ కాలంలోనే కఠిన శిక్షలు అమలు కావాలని మహిళా లోకం కోరుతోంది. గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపడం, సైబర్ నేరగాళ్లపై కఠినంగా వ్యవహరించడం ద్వారానే ఇలాంటి అరాచకాలను అడ్డుకోగలం.

### సభ్య సమాజం సిగ్గుపడేలా వరుస ఘటనలు

- వరంగల్‌లో గంజాయి బ్యాచ్ ఘాతుకం
- గిరిజన యువతిపై గ్యాంగ్ రేప్.. ఉరివేసి హత్య
- మేడ్చల్‌లో ప్రేమోన్మాది వికృత చేష్ట
- పెళ్లికి నిరాకరించిందని యువతికి ఎయిడ్స్ రక్తం ఎక్కించిన కిరాతకుడు
- ఏపీలో న్యూడ్ ఫొటోలతో వేధించిన నీచుడు..
- మనస్తాపంతో ప్రైవేట్ టీచర్ ఆత్మహత్య
- చట్టాలు కఠినంగా ఉన్నా మారని నీచుల ప్రవృత్తి

### తల్లిదండ్రుల బాధ్యత.. సమాజం అప్రమత్తత

కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నడవడికపై నిఘా ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. యువత ఏ మార్గంలో వెళ్తోంది? ఎవరితో స్నేహం చేస్తోంది? సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెడుతున్నారు? అన్న విషయాలను గమనించాలి. అదే సమయంలో ఆపదలో ఉన్న మహిళలకు సమాజం అండగా నిలవాలి. బాధితులను తక్కువ చేసి చూడటం మానేసి, వారిని వేధించే వారిని బహిష్కరించినప్పుడే మార్పు మొదలవుతుంది. ఈ పైశాచిక పర్వం ఆగాలంటే శిక్షలు కఠినంగా ఉండాలి.. ఆలోచనలు సంస్కారవంతంగా మారాలి.

## పూలే సేవలు చిరస్మరణీయం

- సమానత్వం, విద్యా విస్తరణకు ఎంతో కృషి
- ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలి
- పూలే జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి
- మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం



**వేద న్యూస్, హైదరాబాద్**

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేటికీ ప్రాసంగికమని తెలిపారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే చేసిన పోరాటం సమాజానికి మార్గదర్శకమని సీఎం అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఆయన లక్ష్యమని గుర్తుచేశారు. మహిళా విద్యాభివృద్ధికి పూలే చేసిన సేవలను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. మహిళలు చదువుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన నమ్మకం నేటికీ ప్రాధాన్యత కలిగినదని తెలిపారు. యువత పూలే స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో ముందుండాలని సూచించారు. పూలే ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## కేసీఆర్ సభకు ఏర్పాట్లు

- మోతె రోడ్డులో సభా స్థలాన్ని పరిశీలించిన ముఖ్య నేతలు
- లక్ష మందితో సభను జయప్రదం చేసేందుకు సన్నాహాలు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్న కొప్పుల

**వేద న్యూస్, జగిత్యాల**

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభ కోసం పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. ఈ సభకు సంబంధించి మోతె రోడ్డు పక్కన ఉన్న విశాలమైన స్థలాన్ని మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభకు వచ్చే జనసమీకరణ, వాహనాల రాకపోకలు, మరియు భద్రతా అంశాలపై నేతలు చర్చించి తగిన సూచనలు చేశారు. జగిత్యాల గడ్డపై బీఆర్ఎస్ సత్తా చాటేలా ఈ భారీ బహిరంగ సభను నిర్వహించాలని గులాబీ దళం పట్టుదలతో ఉంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండేళ్లలోనే పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలలో ఒక్కటినీ కూడా ప్రభుత్వం చిత్తశుద్ధితో నెరవేర్చలేదని ఆరోపించారు. జగిత్యాల సభ ద్వారా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని, ఈ భారీ బహిరంగ సభ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడం వల్ల ఉత్తర తెలంగాణలో పార్టీకి కొత్త ఊపిరి పోసినట్లయిందని నేతలు అభిప్రాయపడ్డారు. జీవన్ రెడ్డి రాకతో పార్టీ కేడర్‌లో ఉత్సాహం పెరిగిందని, జిల్లాలో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఎదిగిందని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. జగిత్యాల సభ విజయవంతం కావడం ద్వారా జిల్లా రాజకీయాల్లో కీలక మార్పులు వస్తాయని భావిస్తున్నారు. ఈ సభకు పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా హాజరై శ్రేణులకు దిశా నిర్దేశం చేయనుండటంతో, స్థానిక నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తోంది.



## జాగృతి బీసీల కోసం పని చేస్తుంది

- పూలే మళ్లీ పుట్టాడా అనే స్థాయిలో..
- బీసీ ఉప కోటా కోసం కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమం చేద్దాం
- సాధించే వరకూ పోరాటం కొనసాగిద్దాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత



**వేద న్యూస్, హైదరాబాద్**

చట్టసభల్లో మహిళా కోటాలో బీసీ మహిళలకు ఉప కోటా కోసం పూలే గారే మళ్లీ పుట్టారా అన్నట్లుగా కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. ఈ నెల 16, 17, 18 న మహిళ బిల్లుపై పార్లమెంట్ లో చర్చ జరగనుంది. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి అన్ని పార్టీల వారితో ఈ అంశంపై మాట్లాడుతాన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ అధికారం, ఎంపీల బలం ఉందని ఇప్పుడు బిల్లు పాస్ చేసుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు. బీసీ మహిళలకు ఉపకోటా వచ్చే వరకు పోరాటం చేస్తామని పూలే విగ్రహాన్ని ఆయన జయంతి రోజు వరకు పూర్తి చేయాలని మనం ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చామన్నారు. కానీ ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇప్పటికీ కూడా విగ్రహం ఏర్పాటు చేయలేదు అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని కోరితే ట్యాంక్ బండ్ వద్ద పెడతామని చెప్పారు. ఇది పాక్షిక విజయమే అయిన సరే ట్యాంక్ బండ్ వద్ద పూలే విగ్రహం పెట్టాలని కోరాం, కానీ ఇప్పటి వరకు కూడా విగ్రహాన్ని పూర్తి చేయలేదని తెలిపారు. అంబేడ్కర్ జయంతి నాటికైనా పూలే విగ్రహాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఎన్ని కష్టాలు వచ్చిన సరే వెన్ను చూపకుండా పోరాడిన త్యాగధనులు ఏ విప్లవం వచ్చిన సరే త్యాగం పునాదిగా ఉంటుంది. సమాజంలో మార్పు తేవాలంటే ముందు ఆ మార్పు మన నుంచే మొదలుకావాలి. మనం చేపట్టే బాట కూడా ముళ్లబాట మాదిరిగానే ఉంటుంది. ముందు మనల్ని ఒప్పుకోరు. పూలేకి కూడా అదే జరిగింది. ఎన్ని అవమానాలు ఎదురైన సరే ఆయన నమ్ముకున్న తోవను వదలిపెట్టలేదని వివరించారు. అందుకే ఇన్నేళ్ల తర్వాత కూడా ఆయనను మనం గుర్తు చేసుకుంటున్నాం.పూలేకి నిజమైన నివాళి అంటే ఆయన చెప్పిన సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పనిచేయటమే అని స్పష్టం చేశారు.

# ఇల్లందకుంట మండల బీజేపీ నూతన కార్యవర్గం ప్రకటన

**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల భారతీయ జనతా పార్టీ నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన సంఘటనా సంరచనా పర్వం 2025 ప్రక్రియ లో భాగంగా, జిల్లా అధ్యక్షుడు, జిల్లా సంరచనా ప్రభారీల ఏకాభిప్రాయం తో ఈ కమిటీని రూపొందించారు. ఈ నూతన మండల కమిటీ లో ప్రధాన కార్యదర్శులు గా గుత్తికొండ రాంబాబు, అబ్బిడి తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులుగా తడిగొప్పుల రమేష్, తాళ్ల లావణ్య, సామ కర్ణాకర్ రెడ్డి, చింతల ఐలయ్య, కార్యదర్శులుగా కొక్కుల దేవేందర్, మడ్డి శ్రీనివాస్, ఆసాల సుధాకర్, చేలిక వనజ నియమితులయ్యారు. కోశాధికారిగా మురహరి గోపాల్ సహా 45 మందితో ఈ కార్యవర్గం ఏర్పాటయ్యింది. అనుబంధ విభాగలైన వివిధ మోర్చాల అధ్యక్షులు గా ఏనుగు సురేందర్ రెడ్డి (యువ మోర్చా), తుపాకుల సతీష్ (కిసాన్ మోర్చా), గుడికందుల పావని (మహిళా మోర్చా), ఉప్పు దుర్గయ్య (ఓబీసీ మోర్చా), సోమిడి సురేందర్ (ఎస్సి మోర్చా), ఎండీ రియాజ్ (మైనారిటీ మోర్చా) ఎంపికయ్యారు. ఈ నియామకాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి అధికారికంగా వెల్లడించారు.





ఇల్లందకుంట మండలం లో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఈ నూతన బృందం సిద్ధమైంది, ఈ నియామకాలతో క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను వేగవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాడానికి వీలవుతుందని పేర్కొన్నారు.

# తెలంగాణ 'ప్రజావాణి'కి ప్రశంసలు

- పాలనా దక్షతకు నిదర్శనం.. మధ్యప్రదేశ్ అధికారుల మెప్పు
- ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత
- తమ రాష్ట్రంలోనూ అమలుకు మొగ్గు చూపిన బృందం

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమం జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తహసీల్దార్ల బృందం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్‌ను సందర్శించి కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలించింది. ప్రజల సమస్యలను నేరుగా వినే ఈ వేదికను వారు ఆదర్శవంతమైన పరిపాలనా నమూనాగా కొనియాడారు. ప్రజావాణిలో అనుసరిస్తున్న క్రమబద్ధమైన విధానం, ఫిర్యాదుల స్వీకరణ నుంచి పరిష్కారం వరకు ఉన్న పారదర్శక వ్యవస్థ అధికారులను ఆకట్టుకుంది. ముఖ్యంగా డ్యాష్‌బోర్డ్ ఆధారిత పర్యవేక్షణ, ఆన్‌లైన్ ట్రాకింగ్ వ్యవస్థలు సేవల వేగాన్ని పెంచుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణలో విజయవంతంగా కొనసాగుతున్న ఈ విధానాన్ని తమ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని మధ్యప్రదేశ్ అధికారుల బృందం సంకల్పం వ్యక్తం చేసింది. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో ఈ నమూనా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమం ఇప్పటికే విశేష ఫలితాలను ఇస్తోంది. ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ఈ వేదిక ద్వారా లక్షకు పైగా దరఖాస్తులు స్వీకరించగా, సుమారు 74 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయి. నోడల్ అధికారుల వ్యవస్థ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతోంది. ప్రజల భాగస్వామ్యంతో కూడిన జవాబుదారీతనాన్ని పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. 'ప్రవాసి ప్రజావాణి' వంటి వినూత్న కార్యక్రమాలతో సేవలను విస్తరించగా, ఈ విధానం ఇప్పుడు దేశవ్యాప్తంగా సుపరిపాలనకు ఒక బెంచ్‌మార్క్‌గా నిలుస్తోంది.



# హైదరాబాద్‌కు 'పికో' రాక!

- తెలంగాణ సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డితో కీలక భేటీ
- 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా పెట్టుబడుల ఆహ్వానం
- గ్లోబల్ టెక్ హబ్‌గా భాగ్యనగరం
- స్థానిక యువతకు ఉపాధి అవకాశాలపై ఆశలు



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ 'పికో' ప్రతినిధులు తెలంగాణ సచివాలయాన్ని సందర్శించి రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై కీలక చర్చలు జరిపారు. రాష్ట్ర రహదారులు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికి రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' ప్రణాళికను మంత్రి వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా, ఆవిష్కరణల అడ్డాగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విదేశీ కంపెనీలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ఐటీతో పాటు సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లీన్ ఎనర్జీ వంటి భవిష్యత్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానాలు అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పికో వంటి సంస్థల రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని తెలిపారు. పికో ప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వ పారదర్శక విధానాలు, వేగవంతమైన అనుమతుల ప్రక్రియను ప్రశంసించారు. హైదరాబాద్‌లో వ్యాపార విస్తరణకు అనుకూల వాతావరణం ఉందని పేర్కొంటూ త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ భేటీతో హైదరాబాద్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా మరింత బలపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ' లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని అధికారులు తెలిపారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి



- అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి స్ఫూర్తిదాయకం
- కులవివక్ష రహిత సమాజం కోసం పోరాడిన మహానుభావుడు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**వేద న్యూస్, కొల్లాపూర్:**

మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫులే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించిన మంత్రి, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే తన జీవితాన్ని వెనుకబడిన వర్గాలు మరియు మహిళల విద్యాభివృద్ధికి అంకితం చేశారని మంత్రి పేర్కొన్నారు. ఆయన వేసిన పునాదులే నేటి సమాజంలో కనిపిస్తున్న అభ్యుదయానికి కారణమని కొనియాడారు. సమాజంలో ఉన్న కులవివక్ష, అంటరానితనం వంటి సామాజిక దుష్ప్రవర్తనలను నిర్మూలించేందుకు ఫులే అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. 'సత్యశోధక్ సమాజం' ద్వారా సమానత్వ భావనను ప్రజల్లో నాటిన మహనీయుడిగా ఆయనను గుర్తుచేశారు. మహిళా విద్యకు ప్రాధాన్యం ఇచ్చి పాఠశాలలు స్థాపించడం, వితంతువులు మరియు అనాథలకు ఆశ్రయం కల్పించడం వంటి చర్యలు నేటికీ స్ఫూర్తిదాయకమని మంత్రి అన్నారు. ఫులే ఆశయాలను అనుసరిస్తూ ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువత ఫులే జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని మంత్రి పిలుపునిచ్చారు.

# బెస్ట్ 'ఆర్థో' కేర్ ఏదుర్గ ఆస్పత్రి

**- 24/7 అందుబాటులో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ తరుణ్ సింగ్**

**వేద న్యూస్, జమ్మికుంట:**



బెస్ట్ "ఆర్థో" ట్రీట్ మెంట్ కు దుర్గ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి కేరాఫ్ గా నిలుస్తున్నది. జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం కిమ్స్‌లో పని చేసిన ఆర్థోపెడిక్, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ తరుణ్ సింగ్ 24/7 అందుబాటులో ఉండి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఎంబీబీఎస్ ఎంఎస్ ఆర్థో, ఎఫ్ఐజేఆర్, ఎఫెటి(కిమ్స్ ఆస్పత్రి), జాయింట్ రీప్లేస్మెంట్ స్పైన్ స్పోర్ట్స్ ఇంజూరీస్, పెయిన్ మేనేజ్‌మెంట్, రోబోటిక్ సర్జన్ పేరు గాంచిన డాక్టర్ తరుణ్ సేవలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆర్థో సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, జమ్మికుంట పట్టణంలోని దుర్గ ఆస్పత్రిని సంప్రదిస్తే చాలని, వైద్య సేవలు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆర్థో సర్జన్‌గా పదేండ్ల అనుభవం కలిగిన డాక్టర్ తరుణ్ సింగ్ సేవలందిస్తారని పేర్కొన్నారు. రోబోటిక్ సర్జన్‌గా పేరు గాంచిన తరుణ్ సింగ్ కిమ్స్ ఆస్పత్రిలో చక్కటి సేవలందించగా, ప్రస్తుతం జమ్మికుంటలో అందుబాటులో ఉంటున్నారు. సరసమైన ధరలకే చక్కటి వైద్యాన్ని అందించనున్నట్టు డాక్టర్ తరుణ్ సింగ్ తెలిపారు. జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు తమ మోకాలి సంబంధిత సమస్యలకు ట్రీట్మెంట్ కోసం 24/7 దుర్గ ఆస్పత్రిని సంప్రదించొచ్చని వైద్యుడు తరుణ్ సింగ్ పేర్కొన్నారు. చాలా వరకు మోకాలి నొప్పులన్నింటికీ రిప్లేస్మెంట్ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. స్టేజ్ 1,2,3 లలో మందుల ద్వారా నయమవుతుందన్నారు. ఆపరేషన్ అవసరం లేకుండానే మోకాలి, నడుము నొప్పులు నయం చేయబడుతాయని పేర్కొన్నారు. జాయింట్ ప్రాబ్లమ్స్, స్పోర్ట్స్ ఇంజురీస్, బ్యాక్, స్పైన్ డిస్ ఆర్డర్స్, ఫ్రాక్చర్ (ఎముకల విరుగుట) , జాయింట్ రీప్లేస్మెంట్ (హిప్, నీ, షోల్డర్), స్పైన్ సర్జరీ.. వంటి సేవలు దుర్గ ఆస్పత్రిలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆర్థోపెడిక్ సర్జరీ, కేర్ కు సంబంధించి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ తరుణ్ సింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అక్కడ ట్రీట్ మెంట్ తీసుకున్న పలువురు పేషంట్ లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# దివ్యాంగులకు సహాయక ఉపకరణాల పంపిణీ

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అందజేత
- భారత ప్రభుత్వ ఏడీఐపీ పథకం ద్వారా లబ్ధి



**వేద న్యూస్, సికింద్రాబాద్:**

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని లాలాగూడలో దివ్యాంగులకు సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్తీక గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, నడక కర్రలను అందజేశారు. భారత ప్రభుత్వ ఏడీఐపీ పథకం ద్వారా దేశవ్యాప్తంగా దివ్యాంగులకు ఆధునిక పరికరాలను ఉచితంగా అందిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని మంత్రి తెలిపారు. శారీరక వైకల్యం ప్రతిభకు అడ్డుకాదని, సరైన ప్రోత్సాహం ఉంటే వారు అన్ని రంగాల్లో రాణించగలరని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేవలం పరికరాల పంపిణీతోనే కాకుండా, దివ్యాంగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో తమ జీవితం సులభమవుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# పోషణ్ పక్వాడ అవగాహన ర్యాలీ

- ప్రారంభించిన మంత్రి సీతక్క
- ములుగులో జెండా ఊపి శ్రీకారం
- చలివేంద్రాల ప్రారంభం.. వేసవిలో ప్రజలకు ఊరట




**వేద న్యూస్, ములుగు:**

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ములుగు జిల్లా కేంద్రంలో 'పోషణ్ పక్వాడ' అవగాహన ర్యాలీని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని 'ఐ లవ్ ములుగు' థీమ్ వద్ద జెండా ఊపి ర్యాలీకి శ్రీకారం చుట్టారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల పాత్రను మంత్రి ప్రశంసించారు. గ్రామ స్థాయిలో పోషకాహారంపై అవగాహన పెంపొందించడంలో వారు కీలకంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కలెక్టరేట్ కార్యాలయం మరియు పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మంత్రి ప్రారంభించారు. బాటసారులు, ప్రజలు ఎండల వల్ల ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన సమావేశంలో మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీ పారదర్శకంగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీనియర్ న్యాయవాది చేకిలం ఉపేందర్ కి ఘన సన్మానం



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

శ్రీ గోవిందరాజుల గుట్ట వాస్తవ్యులు ప్రముఖ సీనియర్ న్యాయవాది చేకిలం ఉపేందర్ వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా భారీ మెజారిటీతో గెలిచారు. ఈ సందర్భంగా గోవిందరాజుల (గుట్ట) దేవస్థాన ప్రధాన అర్చకులు శ్రీ వరయోగుల శ్రీనివాసా స్వామి, ఓడ పెల్లి శ్యామ్ కృష్ణ సీనియర్ న్యాయవాది ఎర్రం శెట్టి రాఘవరావు ల ఆధ్వర్యంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది ఉపేందర్ ని వారి నివాసంలో శ్రీ గోవిందరాజ స్వామి శేష వస్త్రంతో అదే విధంగా భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు. శ్రీ గోవిందరాజ స్వామి దేవాలయ అర్చకులు వారియోగుల లక్ష్మణస్వామి, జగన్నాథం రాము స్వామి,వారియోగుల ప్రసాద్ స్వామి లతోపాటు స్థానికులు బండా శ్రీనివాస్, చెన్నూరి నటరాజ్, హరిదాస్యం సురేష్,లెల్లెల కిరణ్ కుమార్, ప్రముఖ న్యాయవాదులు ఓడ పెల్లి శ్రీనివాసులు,జున్ను రాబర్ట్,స్థానికులు పెద్ద ఎత్తున విచ్చేసి సన్మాన మహోత్సవంలో పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

- ఖమ్మం రూరల్ అభివృద్ధికి రూ. 64 కోట్లు కేటాయింపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**వేద న్యూస్, ఖమ్మం:**

మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. పూలే అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారని, సమానత్వ సమాజ నిర్మాణమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఏదులాపురం అభివృద్ధికి రూ. 58.95 కోట్లు, ఖమ్మం రూరల్ మండలానికి గత 27 నెలల్లో రూ. 64.92 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. మంగళగూడెం ప్రాంతంలో రూ. 2.50 కోట్లతో రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించిన మంత్రి, పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం 64 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, 227 మందికి రూ. 70.42 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలు, పాలనలో అభివృద్ధే ప్రధానమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఖమ్మాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని సిద్ధాపూర్ గ్రామ సంఘం తరపున ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ బక్కుల అనిత చందు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకెపి ఏపీఎం బస్వంత్ రావు మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దాన్యాన్ని విక్రయించి దిగుబడి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకర్, గ్రామ సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, సీసీ విఠల్ , విఓఎ నవనీత, ట్యాబ్ ఆపరేటర్ వినాయక్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, రైతులు రామరావు , రాములు, శంకర్, జహీర్ , రవి , దత్తు , దిగంబర్ , సాయిలు , బాలరాజు, కృష్ణా , వెంకటి, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫోరెన్సిక్ వైద్యానికి ప్రభుత్వ మద్దతు




- న్యాయ వ్యవస్థకు కీలక ఆధారం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- గాంధీ ఆసుపత్రిలో వార్షిక సదస్సులో పాల్గొన్న మంత్రి

**వేద న్యూస్, హైదరాబాద్:**

గాంధీ ఆసుపత్రిలో నిర్వహించిన ఫోరెన్సిక్ మెడిసిన్ వార్షిక సదస్సుకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫోరెన్సిక్ వైద్య విభాగం ప్రాధాన్యతపై ఆయన ప్రసంగించారు. ఫోరెన్సిక్ విభాగం ఆరోగ్య రంగంతో పాటు న్యాయ వ్యవస్థకు కూడా కీలక ఆధారమని మంత్రి పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేస్తున్న ఫోరెన్సిక్ వైద్యుల సేవలు అత్యంత విలువైనవని, వారి బాధ్యతలు సాంకేతికతతో పాటు మానవత్వం కూడా అవసరమయ్యే వాటిగా ఉన్నాయని అన్నారు. గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదం, సిగాచీ ఫ్యాక్టరీ ఘటనల సమయంలో ఫోరెన్సిక్ బృందాలు చేసిన సేవలను మంత్రి అభినందించారు. మృతదేహాల గుర్తింపు, నివేదికల సిద్ధం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మార్చురీలను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఉస్మానియా, టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో అత్యాధునిక సదుపాయాలతో మార్చురీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఫోరెన్సిక్ వైద్యులు మృతుల కుటుంబాలతో సానుభూతితో వ్యవహరించాలని సూచించిన మంత్రి, ఈ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పీజీ సీట్లను పెంచే దిశగా కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# తాను మరణిస్తూ ఇద్దరి అందులకు చూపునిచ్చాడు




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ రామన్నపేట బొడ్రాయి నివాసి ఇరుకుల్ల నాగభూషణం (85) అనారోగ్య వలన మరణించగా, వారి కుమారుడు వెంకటేశ్వర్లు , భార్య అఖిలాండేశ్వరి సమాజ హితం కోరి, నేత్రదానం చేయడానికి అంగీకరించారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్, ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఎల్వీ ప్రసాద్ సిబ్బంది నేత్ర సేకరణ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ ద్వారా నేత్రదానం కార్నియా సేకరణ చేశారు. నాగభూషణం నేత్రదానంతో ఇద్దరి అందులకు చూపునిచ్చిన వారైనారు, మరియు నేత్ర వైద్య విద్యకు తోడ్పడారు. అని కుటుంబ సభ్యులకు ధన్యవాదములు తెలిపి నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు. మరణానంతరం నేత్రదానం చేద్దాం సామాజిక బాధ్యత నెరవేర్చుకుందాం మరణించినా పునర్జన్మనిద్దాం అని అసోసియేషన్ ప్రతినిధి అన్నారు. వివరాలకు 8790548706, 8340892985‘ 9490133650 సెల్ నెంబర్లను సంప్రదించాల్సిందిగా కోరినారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహానుభావులు పూలే

- జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు
- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి



**వేద, న్యూస్ శాయంపేట :**

సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు . పూలే జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే ఈ దేశంలోనే గొప్ప సామాజిక సంఘసంస్కర్త అని ఆయన ముఖ్యంగా వెనుకబడిన వర్గాలు మహిళల విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. సమానత్వం విద్యా న్యాయం కోసం ఆయన చేసిన కృషి నేటి సమాజానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుంది అని అన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు చింతల రవిపాల్ ,బాసని రవి, వరదరాజు ,మార్కండేయ ,మామిడి సుదర్శన్, గాజె చిరంజీవి, కోల శీను ,వీరన్న ,పాపారావు ,రాజయ్య ,కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య రక్షణకు ఔషధ నియంత్రణ కీలకం




**వేద న్యూస్, హనుమకొండ :**

ప్రజల ఆరోగ్య రక్షణకు ఔషధ నియంత్రణ కీలకమని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, శనివారం హనుమకొండ కలెక్టరేట్లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో ఔషధ నియంత్రణ అవగాహన దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఔషధ పరిశీలకుడు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి హాజరయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. అప్పయ్య, ఈగల్ బృందం పరిశీలకుడు రవీందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీను కలెక్టర్ ప్రారంభించారు.ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఔషధ విక్రేతలు, ఔషధ నిపుణులు పాల్గొని ప్రజల్లో ఔషధాల వినియోగంపై చైతన్యం కల్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

మానవ శరీరం నిర్వీర్యం కాకుండా ఉండాలంటే మోతాదు ప్రకారం, డాక్టర్ సూచనల ప్రకారం మాత్రమే ఔషధాలు వాడాలని అన్నారు. సరైన డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ వాడకూడదని, దీనివల్ల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ఏర్పడి భవిష్యత్తులో మందులు పనిచేయని స్థితి వస్తుందని నకిలీ మందుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మందుల నాణ్యతను తనిఖీ చేయడానికి ప్యాకింగ్‌పై ఉన్న కోడ్ లను స్కాన్ చేయాలని సూచించారు. ఏదైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్: 1800-599-6969 కు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. వీటి సరఫరా విక్రయాలపై సమాచారం ఉంటే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు పిర్యాదు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్లో నిర్వహించిన అవగాహన సదస్సులో వక్తలు మాట్లాడుతూ అలవాటు కలిగించే ఔషధాల దుర్వినియోగం, షెడ్యూల్ హెచ్ మరియు హెచ్1 ఔషధాల నియంత్రణ, క్యూ ఆర్ కోడ్ ద్వారా ఔషధాల ధృవీకరణ, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ నివారణ, లైసెన్స్ ధృవీకరణ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. తెలంగాణ ఈగల్ బృందం ప్రతినిధులు మత్తు పదార్థాల దుర్వినియోగం మరియు ఇతర దురాలవాట్లపై ప్రజలకు చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఔషధాల సరైన వినియోగం, నిబంధనల పాటింపు మరియు ఆరోగ్య పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ అసోసియేషన్ సభ్యులు, మెడికల్ షాపు యజమానులు, ఫార్మసిస్ట్‌లు మరియు నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# పిఎంశ్రీ ఎంపిపిఎస్ పాఠశాలను సందర్శించిన డీఈవో



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ ఎంపిపిఎస్ పాఠశాలను శనివారం (డీఈవో) జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్ సందర్శించారు. విద్యార్థులకు డిజిటల్ క్లాసులు నిర్వహించాలనే ఉద్దేశంతో గ్లోబల్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్ వారు పాఠశాలకు అందించిన ప్రొజెక్టర్ ను డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, ఎంఈఓ శ్రీనివాస్, పిఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, పాఠశాల బృందం, రుద్రూర్ రాయల్స్ బృందం, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 12, 2026

# మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయం

## - బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ జిల్లా నాయకులు కూచన క్రాంతి కుమార్, మండల అధ్యక్షులు విప్ప సుధా కర్ గార్ల ఆధ్వర్యంలో దేశాయిపేట లోని వారి విగ్ర హానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా రవికుమార్ పూలే త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను గుర్తు చేశారు. సామాన్యుడిగా మొదలై.. సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే భావి తరాలకు సైతం మార్గదర్శకుడని గుర్తు చేస్తూ, సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడు పూలేకు గంట రవికుమార్ ఘన నివాళులర్పించారు. వెనుకబడిన వర్గాలు, దళిత జనోద్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరి మురళీకృష్ణ, గోగికర్ అనిల్, జిల్లా నాయకులు గోకే వెంకటేష్, అంకాల జనార్ధన్, బైరి శ్యాం సుందర్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, అల్లి అజయ్, మాదాసు రాజు, కోమాకుల నాగరాజు, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బోరిగం నాగరాజు మండల నాయకులు జన్ను పాటు సుబ్రహ్మణ్యం, తోట సురేష్, కొంతం సంగీత్, మల్లికార్జున్, ప్రభాకర్ గుప్త, హనుమంతు, శ్రీధర్, జన్ను నాగరాజు మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సిబ్బందికి కొబ్బరి నీళ్లు పంపిణీ చేసిన విష్ణురెడ్డి

**వేద న్యూస్, హనుమకొండ :**




ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విధుల్లో నిమగ్నమైన ట్రాఫిక్ సిబ్బందికి ఉపశమనం కలిగించే కార్యక్రమంలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్న సుమారు 60 మంది ట్రాఫిక్ పోలీసులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు రెడ్డి కొబ్బరి నీళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలో నిరంతరం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం అవసరమని తెలిపారు. ప్రజల భద్రత కోసం కృషి చేస్తున్న వారికి ఇలాంటి చిన్న సహాయం కూడా ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు.

# ఎంజీఎం డీ-అడిక్షన్ సెంటర్ ను పరిశీలించిన అధికారులు

**వేద న్యూస్, ఎంజీఎం :**



ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, పునరావాస కార్యక్రమాలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యసనాల నుంచి బయటపడేందుకు రోగులకు అవసరమైన మానసిక బలం అందించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని సిపి సూచించారు. అలాగే, డీ-అడిక్షన్ సెంటర్ సేవలను మరింత మెరుగుపరచాలని, బాధితులకు సమగ్ర సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. నర్సింగ్ స్టాఫ్ కి నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్ ఎస్సే రైటింగ్ కాంపిటీషన్స్ లో గెలుపొందిన వారికి ప్రముఖుల చేతుల మీదుగా ప్రైస్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంజిఎం సూపర్డెంట్ హరిచంద్ర రెడ్డి, హనుమకొండ డిఎం అండ్ హెచ్ అప్పయ్య, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యారాణి, సైకియాట్రిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ అశ్విన్ , హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకులు మృతి

**వేద న్యూస్ రంగారెడ్డి :**




రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ వద్ద బండ్లగూడ జాగీర్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది . ఇద్దరు యువకులు మోటార్‌సైకిల్‌పై వెళ్తు అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అబ్దుల్ సోహెద్ (20), షేక్ సాహిల్ (17) మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన వీరు ఎలక్ట్రిషియన్లుగా పనిచేస్తున్నారని వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు.

# అభివృద్ధే మా అజెండా.. రాజకీయాలకు తావులేదు

- మున్సిపాలిటీకి రూ.58.95 కోట్లు కేటాయించాం
- పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో పర్యటించి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

**రూ.4.50 కోట్లతో రహదారి నిర్మాణం**

వరంగల్ క్రాస్ రోడ్డు ఆటోనగర్ నుంచి మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు రూ.4.50 కోట్లతో నిర్మించనున్న రహదారి పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 32 వార్డుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.58.95 కోట్లు కేటాయించిందన్నారు. ఆటోనగర్ మీదుగా సాగే ఈ రహదారి పూర్తయితే రవాణా కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు.

**ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యం..**

గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో పేదల ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని మంత్రి విమర్శించారు. "ప్రజా పాలన మొదటి ఏడాదిలోనే ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. త్వరలోనే రెండో విడత ప్రక్రియ ప్రారంభిస్తాం" అని ప్రకటించారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, మహిళా సంఘాలకు ఏటా రూ.24 వేల కోట్ల మేర వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వివరించారు.

**లబ్ధిదారులకు బాసట**

ఖమ్మం రూరల్ మండలం, మున్సిపాలిటీ పరిధిలోని 64 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను, 227 మందికి రూ.70.42 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం పంపిణీ వంటి హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- మంగళగూడెంలో రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంగళగూడెం గ్రామంలో రూ. 2 కోట్ల 50 లక్షల వ్యయంతో కొత్తూరు నుండి కాచిరాజుగూడెం వరకు చేపట్టనున్న రోడ్డు మరియు స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పర్యటనలో ఈ ప్రాంతంలో వరదల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూశానని, ఆనాడు ఇచ్చిన హామీని నేడు నిలబెట్టుకోవడం సంతృప్తిని ఇస్తోందని అన్నారు. కల్వర్టు పనులను నాణ్యతతో, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

**మండలాభివృద్ధికి రూ.64.92 కోట్లు**

గడిచిన 27 నెలల కాలంలో ఖమ్మం రూరల్ మండలానికి రూ.64.92 కోట్ల అభివృద్ధి నిధులు వెచ్చించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించామని, మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**సంక్షేమ పథకాలపై భరోసా**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి రూ. 500 బోనస్ వంటి పథకాలు నిరుపేదలకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి దశ మంజూరైందని, త్వరలోనే రెండో దశ ఇళ్లను కూడా అందిస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల సంక్షేమం నుంచి వెనక్కి తగ్గేదే లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాల సందర్భంగా వరంగల్ నగరంలోని ములుగు రోడ్ వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్ పాయి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులు పాల్గొని మహాత్మా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రజాప్రతినిధులు మహాత్మా జ్యోతిరావు పూలే సేవలను స్మరించుకుంటూ, ఆయన సమాజ సంస్కరణల కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, మహాత్మా పూలే ఆశయాలను సాధించేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ, వరంగల్ జిల్లాల ఆదనవు కలెక్టర్లు రవి, వై వి గణేష్, సంధ్యారాణి, డిబిసిడివోలు పుష్పలత, నర్సింహ, జిల్లా అధికారులు, బిసి సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిజామాబాద్ ఎక్సైజ్ శాఖలో భారీ బదిలీలు




**వేద న్యూస్, నిజామాబాద్ :**

నిజామాబాద్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని బాసర జోన్‌లో భారీ స్థాయిలో బదిలీలు చేపట్టారు. 50 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 200 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలు బాసర జోన్ పరిధిలోని నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో పనిచేస్తున్న సిబ్బందికి వర్తించనున్నాయి. పరిపాలనా కారణాలతో ఈ మార్పులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. బదిలీల ద్వారా విభాగంలో పనితీరును మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సిబ్బందిలో సమర్థత పెంచి, విధుల్లో పారదర్శకతను తీసుకురావడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అధికారుల నిర్ణయంతో విభాగంలో కొత్త ఉత్సాహం నెలకొంటుందని భావిస్తున్నారు. కొత్తగా బదిలీ అయిన సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు ఎక్సైజ్ శాఖలో చట్ట అమలు కఠినంగా కొనసాగించేందుకు ఈ మార్పులు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. అక్రమాల నియంత్రణలో మరింత ప్రభావవంతమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. బదిలీ అయిన సిబ్బంది త్వరలోనే తమ కొత్త విధుల్లో చేరాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖలో సేవల నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# ఎండలో ప్రయాణికుల కష్టాలు



**వేద న్యూస్, చొప్పదండి :**

“ఎండాకాలం అంటేనే భగభగమండి సూరీడు.. రోజురోజుకూ పెరిగే ఉష్ణోగ్రతలు.. వేడిగా తాకే వడగాలులు... వాటి దాటికి గురయ్యే వడదెబ్బలే గుర్తుకొస్తాయి. ఇలాంటి సీజన్లోనే శుభకార్యాలు ఎక్కువగా ఉంటాయి. తప్పనిసరి వెళ్లాల్సిన పరిస్థితులూ ఎదురవుతుంటాయి. కార్లు, వాహనాలున్న కుటుంబాలకు పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎండా కాలం ప్రయాణాలంటేనే పెద్ద పరేషాన్. బస్సుల్లో వెళ్లడం ఒకెత్తయితే, వాటి కోసం బస్టాప్ ల్లో వేచి చూడటం మరో కష్టం. చొప్పదండి పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా బస్ స్టాప్ లో కనీసం ప్రయాణికుల కోసం ఎలాంటి సదుపాయాలు లేకుండా ఉండటం తో ఎర్రటి ఎండ లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూర్చుండామంటే షెడ్లు, బెంచీలు కూడా లేకపోవడం ప్రయాణికులు చాలా ఇబ్బంది పడాల్సిందే. ప్రయాణికులకు దగ్గరలోని ఫ్లెక్సీ బోర్డులు, హోటళ్లే దిక్కవుతున్నాయి. చాలా చోట్ల రోడ్లపైనే నిల్చోవాల్సి వస్తోంది. బస్సులు వచ్చేవరకూ ఎండలోనే ఉండాల్సి వస్తుంది.

**క్రమ క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..పిల్లలు, వృద్ధుల బాధ వర్ణనాతీతం**

ఓవైపు ఎర్రటి ఎండ, మరోవైపు నల్లటి తారురోడ్డు వేడి అయినా తప్పని దుస్థితి. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఈ పరిస్థితి ఉంది. ఇక్కడి నుంచి ప్రయాణికులు ధర్మారం, లక్షెటిపేట్, మంచిర్యాల్, జగిత్యాల్, చుట్టుపక్కల గ్రామాలకు వెళ్తుంటారు. ఇంకోపక్క కరీంనగర్ వెళ్లే ప్రధాన కూడలిగా ఉన్నా... ఇక్కడ కూడా ఎలాంటి బస్టాప్ షెడ్డు, ఏర్పాట్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

**ఇప్పటి నుండి కష్టమే**

ఇప్పుడే 30-40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్ర తలు నమోదవుతున్నాయి. ఇప్పటికే 37ళీ దాటిన ఉష్ణోగ్రత రెండు రోజుల్లో 40 డిగ్రీలకు చేరుతుందని వాతావరణ శాఖ హెచ్చరిక గమనార్హం. మార్చి మొదటి, రెండోవారంలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలుంటే ఇకముందు ఎండ ఎంత ప్రచండంగా ఉంటుందోనని మండలవాసులు ఇప్పటి నుంచే బెంబేలెత్తుతున్నారు. ఇలాంటి ఎండల్లో ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు కనీస జాగ్రత్త లు తీసుకోవాల్సిందే. వ్యక్తిగతంగా ఎంత జాగ్రత్త లు తీసుకున్నా. ఇలా రోడ్లపై బస్సులు, వాహనాల కోసం వేచి చూడాల్సి వచ్చినప్పుడు ఇబ్బందే. పక్కన చెట్టో, హోటలో ఉంటే సరి. లేదంటే అవి వచ్చేదాకా అలా ఎండలో ఉండిపోవాల్సిందే.

**ప్రమాదాలకూ ఆస్కారం**

బస్టాప్లు లేకపోవడం రోడ్డు ప్రమాదాలకూ కారణంగా మారుతోంది. నియోజకవర్గ కేంద్రంలోనే బస్టాప్ లేక ప్రయాణికులంతా రోడ్డుపైనే వేచి ఉండటం, బస్సు దిగడం చేస్తున్నారు. వాహనాలు వేగంగా వెళ్తుంటతాయి. దాంతో ఈ స్థలం ప్రమాదాలు జరుగుతాయేమోనని భయపడుతున్నారు. నిత్యం వందలాదిమంది ప్రయాణికులు, మరి భారీ వాహనాలతో ఇది చాలా రద్దీగా ఉండే హైవే. ఇక్కడ వాహనాలూ వేగంగా వెళ్తుంటాయి. ప్రమాదాలకూ ఆస్కారం ఉంటుంది. ఇవన్నీ ఒకెత్తయితే.. ప్రస్తుత వేసవి ఎండలు ప్రయాణికులకు మరింత ఇబ్బందిగా మారుతున్నాయి. బస్సులు, ఆటోల కోసం రోడ్డుపైనే వేచిచూడాల్సి వస్తోంది. ప్రమాదాలకు ఆస్కారం ఉండే చోటు కావడం. తో ఇక్కడ సరైన బస్టాప్ ఉండాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. వృద్ధులు, స్కూల్ పిల్లలకు చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. షెడ్లు, బెంచి లైనా పెట్టించరూ.. బస్ స్టాప్ ఏర్పాటు అంటే. ఏదో పెద్ద బస్టాండ్ అంత అవసరం లేదు. కనీసం ఓ పదిమంది కూర్చునేలా బెంచీలు, ఆపై ఎండ, వానకు ఇబ్బంది లేకుండా ఓ పక్కా షెడ్డు ఉంటే సరిపోతుందని ప్రయాణికులు అంటున్నారు.

**షెల్టర్లు కట్టించాలి**

ఈ స్థలాల్లోఎప్పుడూ పబ్లిక్ బాగానే ఉంటరు. వాహనాల రాకపోక లూ ఎక్కువగానే ఉంటయ్, బస్టాప్ లేకపోవడం, ఇబ్బంది కరం ఇక్కడ ఇస్టాప్ కట్టిస్తే బాగుంటుందని ప్రయాణికుల అభిప్రాయం. ఎండలోనే నిల్చుంటున్న ప్రయాణికులు తీవ్రమైన ఎండలను వడగాలులను దృష్టిలో పెట్టుకుని షెడ్లతో పాటు చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# ధైర్యంగా ఉండండి..శిక్షపడేలా చేద్దాం

**- బాధితుడికి భరోసానిచ్చిన సామాజిక కార్యకర్త ఎండీ ఫసీ**



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి సమయంలో ఓ వ్యక్తిని బండ రాయితో విచక్షణ రహితంగా దాడి చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ఎండీ ఫసీ బాధితున్ని ఎంజీఎం ఆసుపత్రిలో శనివారం పరామర్శించారు. ధైర్యంగా ఉండండి నిందితుడికి శిక్షపడేలా చేద్దామంటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఫసీ మాట్లాడుతూ వరంగల్ ఎస్ఆర్ నగర్ కాలనీలో నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనంతో గంజాయి మత్తులో యాక్సిడెంట్ చేసి కింద పడ్డ వ్యక్తిని వాహనంపై ఎక్కించుకొని దగ్గర లోని గ్రౌండ్ లోకి తీసుకెళ్లి బండ రాయ్ తో కొట్టి కత్తి తో దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన యువకులపై గతంలో కూడా పలు కేసులు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులు ఎంతటివారైనా సరే కఠినంగా శిక్షించాలని బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని,అధికారులను ఆయన డిమాండ్ చేశారు.

# తలమడుగు రైతులకు భూపట్టాల పంపిణీ చేసిన కలెక్టర్



**వేద న్యూస్, ఆదిలాబాద్ :**

తలమడుగు మండలం పల్సీ (బి) తండాకు చెందిన 9 మంది రైతుల కు 30 ఎకరాల భూ పట్టాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా పంపిణీ చేశారు. జడ్పీ సమావేశ మందిరం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు భూపట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రత్యేక చొరవ తీసుకుని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. భూపట్టాల పంపిణీతో రైతులకు స్థిరమైన హక్కులు లభిస్తాయని అన్నారు. పల్సీ (బి) తండాకు చెందిన రైతులు చాలా కాలంగా భూ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ సమస్యను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కారం చూపినట్లు వెల్లడించారు. రైతులకు సాగు భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారి జీవనోపాధి మెరుగుపడుతుందని చెప్పారు. భూపట్టాలు అందుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వంపై తమ నమ్మకం మరింత పెరిగిందని రైతులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ జడ్పీటీసీ గణేష్ రెడ్డి పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని వారు సూచించారు. అలాగే కార్యక్రమంలో రైతులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత చర్యలు తీసుకుంటుందని అధికారులు వెల్లడించారు.

# ఫూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధి సాధ్యం

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**




**వేద న్యూస్, జనగామ :**

మహాత్మా జ్యోతిరావు ఫూలే 200వ జయంతి వేడుకలను జనగామ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ఫూలే చిత్రపటానికి జ్యోతి వెలిగించి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం ఫూలే చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేటికీ ప్రస్తుతానికీ మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి విద్య ప్రధాన సాధనమని, సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు విద్యే కీలకమని వివరించారు. సమాజంలో వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఫూలే లక్ష్యమని గుర్తుచేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సంఘాల ప్రతినిధులు ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తదితరులు పాల్గొన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, సేవాదళ్ ప్రతినిధులు, రెడ్ క్రాస్ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఫూలే ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాలని పలువురు సూచించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎన్.ఎల్. నరసింహరావు, ఏబీసీడీఓ రవీందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిద్దయ్య గౌడ్, వేముల బాలరాజు, మేకల సమ్మయ్య, గంటె ఉపేందర్ యాదవ్, బిర్రు సత్యనారాయణ, కృష్ణమూర్తి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. సమాజ అభివృద్ధి కోసం ఫూలే స్ఫూర్తితో ముందుకు సాగాలని నిర్ణయించారు.

# అమరవీరుల సంస్మరణ దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

**- స్మారక స్థూపం వద్ద ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా**



**వేద న్యూస్, ఆదిలాబాద్ :**

ఈ నెల 20న నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ నియోజ కవర్గ శాసన సభ్యుడు వెడ్మ బొజ్జు కూడా పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. స్మారక స్థూపం వద్ద శుభ్రత, భద్రత, వేదిక ఏర్పాట్లు, రాకపోకల నిర్వహణ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంస్మరణ దినోత్సవాన్ని గౌరవప్రదంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకునే ఈ కార్యక్రమం ఘనంగా జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా కొత్త తరాలకు స్ఫూర్తి కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# నర్సింగి సర్కిల్‌లో మెగా శానిటేషన్ డ్రైవ్ విజయవంతం

- 10 కిలోమీటర్ల పరిధిలో శుభ్రత కార్యక్రమాలు
- 173 టన్నులకుపైగా వ్యర్థాల తొలగింపు
- ఎన్‌క్రోచ్‌మెంట్ల తొలగింపు, మౌలిక సదుపాయాల మెరుగుదల



**వేద న్యూస్, హైదరాబాద్ :**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నర్సింగి సర్కిల్45లో మెగా శానిటేషన్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పరిసరాల్లో శుభ్రతతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టారు. ఈ డ్రైవ్‌లో భాగంగా సుమారు 10 కిలోమీటర్ల పరిధిలోని 20 ప్రధాన ప్రాంతాలను కవర్ చేశారు. 40 మంది అధికారులు, 313 మంది శానిటేషన్ సిబ్బంది పాల్గొని శుభ్రత పనులను నిర్వహించారు. జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు, ఆటోలు సహా 47 వాహనాలు వినియోగించారు. శుభ్రత కార్యక్రమంలో భాగంగా 15 మెట్రిక్ టన్నుల చెత్త, 7 మెట్రిక్ టన్నుల సిల్ట్, 150 మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాలు, 1.7 మెట్రిక్ టన్నుల గ్రీన్ వ్యర్థాలను తొలగించారు. మొత్తం 173.7 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. అదనంగా 350 ఎన్‌క్రోచ్‌మెంట్లను తొలగించి పాదచారులకు సౌకర్యవంతమైన మార్గాలను కల్పించారు. 25 స్ట్రీట్ లైట్లను మార్చి భద్రతను పెంచారు. 7 లూజ్ కేబుళ్లను సరిచేసి మౌలిక వసతులను మెరుగుపరిచారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని శుభ్రతపై అవగాహన పెంపొందించారు. కమ్యూనిటీ భాగస్వామ్యం ఈ కార్యక్రమ విజయానికి కీలకంగా నిలిచింది. సైబరాబాద్ పరిధిలో ఇలాంటి మెగా శానిటేషన్ డ్రైవ్‌లను దశలవారీగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలో శుభ్రతను స్థిరంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# భావితరాలకు స్ఫూర్తిగా నిలిచే మహనీయుడు ఫూలే



**వేద న్యూస్, నల్గొండ :**

మహాత్మా జ్యోతిరావు ఫూలే ద్విశతాబ్ది ఉత్సవాలను నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, నాణ్యమైన విద్య కోసం మహాత్మా ఫూలే చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఫూలే చేసిన సేవలు సమాజానికి మార్గదర్శకమని కలెక్టర్ తెలిపారు. విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలన్న ఆయన సంకల్పం నేటికీ ప్రాసంగికమని పేర్కొన్నారు. ఫూలే ఆశయాలను ఆచర ణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఫూలే సేవలను స్మరించారు. ఈ సందర్భంగా ఫూలే ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. సమాజంలో సమానత్వం నెలకొల్పే దిశగా కృషి కొనసాగించాలని అధికారులు తెలిపారు.

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 12, 2026

# హనుమాన్ సర్వ జగత్ రక్షకుడు



**– మాజీ మంత్రి హరీష్ రావు**

**వేద న్యూస్, సిద్దిపేట :**

హనుమాన్ మాలధారణ ప్రారంభం నేపథ్యంలో సిద్దిపేటలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీష్ రావు రామరాజు రావి చెట్టు హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన హనుమాన్ మాలధారణ స్వాముల భిక్షా కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొని స్వాములతో కలిసి భిక్ష తీసుకున్నారు. భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా భక్తి భావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆలయంలో ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయానికి వెండి ఆభరణాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ హనుమాన్ సర్వ జగత్ రక్షకుడని పేర్కొన్నారు. స్వాముల దీక్ష ఫలించి వారి సంకల్పాలు నెరవేరాలని ఆకాంక్షించారు. హనుమాన్ స్వామి ఆశీస్సులతో అందరికీ శుభం కలగాలని కోరుకున్నారు. సిద్దిపేట హనుమాన్ మాలధారణకు కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దీక్ష చేపడుతున్నారని చెప్పారు. ఈ ఆధ్యాత్మిక సంప్రదాయం ప్రాంతీయ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, హనుమాన్ మాలధారణ స్వాములు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధల మధ్య కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

# మాదకద్రవ్యాల విముక్తి కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు

**వేద న్యూస్, మెదక్ :**



మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శనివారం ఒక కీలక విభాగం అందుబాటులోకి వచ్చింది. మాదకద్రవ్యాలు మరియు వివిధ వ్యసనాలకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'సబ్‌స్టాన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్' చికిత్సా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు. సమాజంలో పెరుగుతున్న వ్యసనాల బారి నుండి యువతను, బాధితులను కాపాడేందుకు ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యాధునిక వసతులతో కూడిన ఈ కేంద్రంలో బాధితులకు మానసిక మరియు శారీరక చికిత్సలు అందించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా వైద్య అధికారి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కూడా పాల్గొన్నారు. కలెక్టర్ వారితో కలిసి నూతన చికిత్సా కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరికరాలు మరియు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్న వారికి సరైన సమయంలో వైద్యం మరియు కౌన్సెలింగ్ అందించడం ద్వారా వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి ప్రత్యేక విభాగం ఏర్పాటు కావడం జిల్లా ప్రజలకు గొప్ప వరమని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుంటే, మరోవైపు బాధితులకు వైద్యం అందించడంలో వైద్య ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు వివరించారు. ఈ సిక్కు కేంద్రంలో శిక్షణ పొందిన వైద్యులు మరియు నర్సులు నిరంతరం అందుబాటులో ఉండి బాధితులకు తగిన సూచనలు ఇస్తారని తెలిపారు. ముఖ్యంగా మద్యపానం, గంజాయి వంటి ఇతర వ్యసనాలకు బానిసలైన వారిని గుర్తించి వారికి ఇక్కడ ఉచితంగా చికిత్స అందిస్తారు. ఈ కేంద్రం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రిలో ఇతర విభాగాలను కూడా కలెక్టర్ తనిఖీ చేసి, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, పారిశుద్ధ్య నిర్వహణలో రాజీ పడకూడదని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. మెదక్ జిల్లాలో వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన నిధులు మరియు సిబ్బందిని సమకూర్చుతామని భరోసా ఇచ్చారు. ఈ నూతన చికిత్సా కేంద్రం ఏర్పాటుపై స్థానిక ప్రజలు మరియు రోగుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య అధికారులు మాట్లాడుతూ, వ్యసన విముక్తి కోసం ప్రైవేట్ ఆసుపత్రులలో భారీగా ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా, ఇప్పుడు మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా చికిత్స పొందవచ్చని తెలిపారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ వారికి తగిన కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా కేంద్రంలోనే ఈ సదుపాయం అందుబాటులోకి రావడంతో పరిసర మండలాల ప్రజలకు కూడా ఎంతో మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక మార్పుకు మరియు ప్రజారోగ్యానికి ఈ కేంద్రం ఒక మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స సేవలు

**వేద న్యూస్, కొత్తగూడెం:**



వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అందుబాటులో ఉండేలా కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా వ్యసన బాధితులకు సమగ్ర వైద్య చికిత్స, నిపుణుల పర్యవేక్షణలో పునరావాస సేవలు అందించబడతాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం అదే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. బాధితులు పూర్తిగా కోలుకునేలా నిరంతర కౌన్సిలింగ్ అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మద్యానికి బానిసైన రోగితో కలెక్టర్ మాట్లాడి అతని పరిస్థితిని తెలుసుకున్నారు. రోజువారీ ఆదాయం, మద్యం ఖర్చులు వంటి అంశాలను విచారించారు. పలు మార్లు మద్యం మానేందుకు ప్రయత్నించినప్పటికీ వణుకుడు, ఫిట్స్ వంటి సమస్యలు రావడంతో చికిత్స కోసం వచ్చానని రోగి తెలిపాడు. ఈ తరహా కేసులకు సమగ్ర వైద్య సేవలు అందించాలని వైద్యులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా చికిత్స విధానాలు, కౌన్సిలింగ్ పద్ధతులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పూర్తిగా కోలుకునేలా వైద్య సేవలు అందించడంతో పాటు కుటుంబ సభ్యుల సహకారం కూడా అవసరమని తెలిపారు. సమగ్ర చికిత్సతో పాటు నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా "డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే" కార్యక్రమం కింద నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంస పత్రాలు, శిల్డులు అందజేశారు. యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. మత్తు వ్యసన నిర్మూలనలో ప్రభుత్వ శాఖలు, వైద్య విభాగం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు బాధితులను ప్రోత్సహించి ఈ కేంద్ర సేవలను వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరిని క్రీడాకారుల హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే పులివర్తి నాని
- ఇండోర్ స్టేడియం పనుల పై సమీక్ష
- విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమని సూచన
- నాణ్యతతో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు



**వేద న్యూస్, చంద్రగిరి :**

చంద్రగిరి నియోజకవర్గాన్ని క్రీడాకారుల హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. చంద్రగిరి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. స్టేడియం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు శాప్ చైర్మన్ రవి నాయుడు, హాకీ క్రీడాకారిణి రజినీతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు సాదర స్వాగతం పలికారు. స్టేడియంలోని వెయిటింగ్ హాల్, క్రీడా మైదానం, విశ్రాంతి గది, జిమ్ గదులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఇండోర్ స్టేడియం ఆవరణంలో జరుగుతున్న పనులు వేగంగా కొనసాగుతున్నప్పటికీ, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం నూతన ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న పనులను మండల స్థాయి అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యాలయ నిర్మాణం కూడా సమయానికి పూర్తి కావాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ సమన్వయంతో పనిచేస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది

**– కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**

**వేద న్యూస్, శ్రీకాకుళం :**



శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని సీ.ఎస్.పి రోడ్డు నుండి ఇప్పిలి వరకు రెండు కోట్ల రూపాయల భారీ నిధులతో నిర్మించిన బి.టి రోడ్డును ఆయన జాతికి అంకితం చేశారు. అదేవిధంగా వాడాడ గ్రామంలో సుమారు కోటి రూపాయల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి పనులు పూర్తి కావడంతో స్థానిక ప్రజలు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా వాడాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న స్థానిక చెరువును రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు ఆక్రమణలకు గురికాకుండా చూడటంతో పాటు, దానిని ఆధునీకరించి రైతులకు సాగునీటి అవసరాలకు ఉపయుక్తంగా మార్చుతామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. పల్లెల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మారుమూల గ్రామాల్లో కూడా రవాణా మరియు సాగునీటి సౌకర్యాలను మెరుగుపరుస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే మౌలిక సదుపాయాలు పటిష్టంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి రామ్మోహన్ నాయుడు పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామని చెప్పారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిధులను సక్రమంగా వినియోగించి, శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాలతో శ్రీకాకుళం గ్రామీణ ప్రాంతాల్లో రవాణా కష్టాలు తీరతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి త్వరితగతిన స్పందించేలా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మరియు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొని అభివృద్ధి పనుల పురోగతిని పర్యవేక్షించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నామని, ప్రతి గ్రామానికి బి.టి రోడ్డు సౌకర్యం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులను గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి వినియోగిస్తున్నామని తెలిపారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా పర్యవేక్షణ చేస్తున్నామని అధికారులకు సూచించారు. వాడాడ మరియు ఇప్పిలి గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తమ ప్రాంతానికి కొత్త రోడ్లు రావడంతో పాటు, చెరువును బాగు చేస్తామని మంత్రి ఇచ్చిన హామీ పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రామ్మోహన్ నాయుడు స్వయంగా గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడం పట్ల స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లాలో రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని ప్రభుత్వం ఈ సందర్భంగా వెల్లడించింది.

# రౌడీ షీటర్లకు సీఐ శ్రీరామ్ స్ట్రాంగ్ వార్నింగ్

- ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు
- గంజాయి నియంత్రణపై కఠిన హెచ్చరికలు

**వేద న్యూస్, పులివెందుల :**



పులివెందుల ప్రాంతంలో రౌడీ షీటర్లకు పోలీసులు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా పులివెందుల సీఐ శ్రీరామ్ మాట్లాడుతూ ప్రవర్తన మార్చుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసి చట్టపరంగా జీవనం సాగించాలని సూచించారు. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని హెచ్చరించారు. ప్రత్యేకంగా గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై పోలీసులు గట్టి నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. పులివెందులలో గంజాయి కనిపిస్తే తాను కఠినంగా వ్యవహరిస్తానని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. నేర కార్యకలాపాల్లో పాల్గొనే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని సీఐ తెలిపారు. రౌడీ షీటర్ల కదలికలను గమనిస్తూ అవసరమైనప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రాంతంలో నేరాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, పులివెందులను శాంతియుత ప్రాంతంగా నిలిపేందుకు కట్టుబడి ఉన్నామని సీఐ శ్రీరామ్ స్పష్టం చేశారు.

# పెట్టుబడి పేరుతో ఆన్‌లైన్ మోసాలు

- ప్రజలకు పోలీసుల హెచ్చరిక
- అధిక లాభాల మాయలో మోసపోవద్దని సూచన
- తెలియని యాప్‌లు, వెబ్‌సైట్లపై అప్రమత్తంగా ఉండాలి
- వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచనలు

**వేద న్యూస్ హైదరాబాద్ :**

పెట్టుబడి పేరుతో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. తెలియని వ్యక్తులు లేదా సంస్థలు వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా పెట్టుబడుల పేరుతో సందేశాలు పంపుతున్నారని పేర్కొన్నారు. ఈ మాయలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పెట్టుబడి పెట్టే ముందు ఆ సంస్థల విశ్వసనీయతను పూర్తిగా నిర్ధారించుకోవాలని పోలీసులు తెలిపారు. ఆకర్షణీయమైన ఆఫర్లు చూపించి మోసగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారని హెచ్చరించారు. తెలియని వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎవరికీ చెప్పకూడదని స్పష్టం చేశారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. పెట్టుబడుల విషయంలో జాగ్రత్తగా ఉండటం ద్వారానే ఇలాంటి మోసాల నుండి రక్షణ పొందవచ్చని తెలంగాణ పోలీసులు స్పష్టం చేశారు.




# పూలే స్ఫూర్తితో బీసీలకు న్యాయం చేసినది జగన్ పాలనే

- వైయస్సార్సీపీ నాయకులు
- విజయవాడలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ
- బీసీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాధాన్యం కల్పించామన్న వైయస్సార్సీపీ
- జగన్ మళ్లీ రావాలని బీసీలు కోరుకుంటున్నారని వ్యాఖ్యలు

**వేద న్యూస్, విజయవాడ :**

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్సీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కూడా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ బీసీలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అండగా నిలిచిన ఘనత వైయస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని స్పష్టం చేశారు. బీసీలను 'బ్యాక్ వర్డ్ క్లాస్'గా కాకుండా 'బ్యాక్ బోన్ క్లాస్'గా గుర్తించి ఆయన పాలనలో సామాజిక న్యాయం జరిగిందని పేర్కొన్నారు. వైయస్సార్సీపీ హయాంలో 56 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రాధాన్యం కల్పించామని తెలిపారు. మంత్రి వర్గంలో 25 మందిలో 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు



చెందిన వారే ఉన్నారని పేర్కొన్నారు. అదేవిధంగా 11 మంది బీసీలను మంత్రులుగా నియమించి రాజకీయంగా ప్రోత్సహించామని వివరించారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కూడా జగన్‌కే దక్కుతుందని నాయకులు పేర్కొన్నారు. డీబీటీ ద్వారా పథకాల రూపంలో భారీగా నిధులు జమ చేసి ఆర్థికంగా అండగా నిలిచారని తెలిపారు. బీసీలకు రూ.1.70 లక్షల కోట్లకు పైగా లబ్ధి చేకూర్చినట్లు గుర్తు చేశారు. చంద్రబాబు కోర్టుకెళ్లి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నారని విమర్శించారు. అయినప్పటికీ 67 శాతం స్థానాల్లో బీసీలకు పదవులు కల్పించి రాజకీయ అవకాశాలు ఇచ్చిన ఘనత జగన్‌దేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీలు మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీలు మరియు ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు. పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# అంతరిక్ష అన్వేషణలో గగారిన్ సాహస యాత్ర

- మానవాళి సాధించిన అద్భుత వైజ్ఞానిక విజయం
- ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష దినోత్సవ వేడుకలు
- శాంతియుత ప్రయోజనాలే లక్ష్యంగా పరిశోధనలు

**వేద న్యూస్ డెస్క్:**

మానవ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిన రోజైన ఏప్రిల్ 12ను ప్రపంచవ్యాప్తంగా 'అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. 1961వ సంవత్సరంలో సరిగ్గా ఇదే రోజున సోవియట్ యూనియన్‌కు చెందిన యూరీ గగారిన్ మొట్టమొదటిసారిగా అంతరిక్షంలోకి అడుగుపెట్టి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఆయన ప్రయాణించిన 'వోస్టాక్-1' వ్యోమనౌక భూమి చుట్టూ ఉన్న కక్ష్యలో 108 నిమిషాల పాటు తిరుగుతూ విజ్ఞాన శాస్త్ర రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ విజయం కేవలం ఒక దేశానికే పరిమితం కాకుండా, యావత్ మానవజాతి సాధించిన ఘనతగా చరిత్ర పుటల్లో నిలిచిపోయింది.

ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని గౌరవిస్తూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2011 ఏప్రిల్ నెలలో ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అప్పటి నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 12వ తేదీని అధికారికంగా అంతర్జాతీయ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. శాంతియుత ప్రయోజనాల కోసం అంతరిక్ష అన్వేషణను కొనసాగించడం మరియు విశ్వంలో మానవుని మేధస్సుకు ఉన్న శక్తిని చాటిచెప్పడం ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశ్యం. గగారిన్ సాహసం అందించిన స్ఫూర్తితో నేడు అనేక దేశాలు అంతరిక్ష రంగంలో భారీ ప్రయోగాలు చేస్తూ నూతన ఆవిష్కరణలకు బాటలు వేస్తున్నాయి. గత ఆరు దశాబ్ద కాలంలో అంతరిక్ష పరిశోధనలు ఊహించని స్థాయికి చేరుకున్నాయి.



చంద్రునిపై అడుగు పెట్టడం నుండి అంగారక గ్రహంపైకి రోవర్లను పంపడం వరకు సైన్స్ ఎన్నో అద్భుతాలను సాధించింది. ఈ క్రమంలోనే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వంటి ప్రాజెక్టుల ద్వారా వివిధ దేశాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. మానవుడు భూమికి ఆవల సుదీర్ఘకాలం నివసించగలగడం మరియు ప్రయోగాలు చేయడం వల్ల వైద్య, సమాచార మరియు వాతావరణ రంగాలలో పెనుమార్పులు సంభవించాయి. గగారిన్ వేసిన తొలి అడుగు నేడు ఇతర గ్రహాలపై నివాసాల ఏర్పాటు దిశగా మనల్ని నడిపిస్తోంది.

భవిష్యత్తులో అంతరిక్ష పర్యాటకం అనేది ఒక ప్రధాన అంశంగా మారబోతోంది. స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజిన్ వంటి ప్రైవేట్ సంస్థలు సాధారణ పౌరులను అంతరిక్షంలోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఇది కేవలం పరిశోధనలకే పరిమితం కాకుండా, ఒక నూతన వాణిజ్య రంగానికి దారితీస్తోంది. అయితే ఈ క్రమంలో అంతరిక్ష వ్యర్థాల సమస్య మరియు బాధ్యతాయుతమైన అన్వేషణపై చర్చలు జరుగుతున్నాయి. గగారిన్ ఆశించిన శాంతియుత ప్రయోజనాలే పునాదిగా ఈ అన్వేషణ సాగాలని ప్రపంచ దేశాలు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏప్రిల్ 12 కేవలం ఒక క్యాలెండర్ తేదీ మాత్రమే కాదు, అది మానవ ఆకాంక్షల మరియు విజయాల ప్రతీక. గగారిన్ చూసిన నీలిరంగు భూమి ఫోటోలు మన గ్రహాన్ని ప్రేమించేలా చేశాయి. ఆయన అందించిన స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు అందుకోవాలని మనందరం ఆకాంక్షిద్దాం. విజ్ఞాన శాస్త్రం అందించిన ఈ వరాన్ని సమాజ హితం కోసం వాడుతూ, విశ్వాంతరాళాల్లో మానవుని కీర్తి జెండాను ఎగురవేద్దాం. ఈ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరుకుంటూ, ఈ చారిత్రక దినానికి సెల్యూట్ చేద్దాం.

# ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి

- ఏఐఎఫ్ డిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున




**వేద న్యూస్, హన్మకొండ :**

తెలంగాణ రాష్ట్రంలో నేడు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో విద్య హక్కు చట్టం అమలు తుంగలోకి తొక్కుతూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఏ ఐ ఎఫ్ డి ఎస్ (అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య) రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున మండిపడ్డారు. శనివారం వరంగల్ అండర్ రైల్వే బ్రిడ్జి ఓంకార్ భవన్ లో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య వరంగల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు గూడా సాయిరాం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున హాజరై మాట్లాడుతూ విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో 2026- 27 సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నారని అన్నారు. ప్రతి విద్యా సంవత్సరం విద్యాసంస్థల పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ప్రైవేటు బడులు విద్యార్థులు చదువును సంతలో సరుకుగా మార్చేస్తున్నాయని అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు వత్తాసు పలుకుతూ ఈ మధ్యకాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పోయి కార్పొరేటు విద్యాసంస్థను ప్రారంభించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఒకపక్క ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు చేరకూడదు ప్రైవేట్ పాఠశాలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తామని చెప్పినప్పటికీ దాన్ని అధికారులు పాటించకపోగా విద్యాహక్కు చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిని తన దగ్గర పెట్టుకొని వివిధ వ్యవస్థను ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యాలకు ధారాధత్వం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టం సెక్షన్-6 నిబంధన ప్రకారం అడ్మిషన్లు జరగాలి కానీ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ ఫీజులను నియంత్రణకై అన్ని ఉత్తర్వులు ఉన్నా గాని ఆచరణలో అవన్నీ శూన్యం అని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో లాగే ద్వంద వైఖరిని వ్యవహరిస్తూ పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలకు అప్ప చెబుతున్నారని అన్నారు. కాబట్టి తక్షణమే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని వారు కోరారు.లేనియెడల అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థుల సమాఖ్య ఏ ఐ ఎఫ్ డి ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎఫ్ డి ఎస్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజ్, రాకేష్,విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులు మహేష్, కళ్యాణ్, జిల్లా కమిటీ సభ్యులు అరవింద్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సబ్‌స్టాన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్ చికిత్సా కేంద్రం ప్రారంభం

- మాదకద్రవ్యాల విముక్తి కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- వైద్యులతో కలిసి ఆసుపత్రి సౌకర్యాలను పరిశీలించిన అధికారులు

**వేద న్యూస్ మెదక్ :**

మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శనివారం ఒక కీలక విభాగం అందుబాటులోకి వచ్చింది. మాదకద్రవ్యాలు మరియు వివిధ వ్యసనాలకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'సబ్‌స్టాన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్' చికిత్సా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు. సమాజంలో పెరుగుతున్న వ్యసనాల బారి నుండి యువతను, బాధితులను కాపాడేందుకు ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యాధునిక వసతులతో కూడిన ఈ కేంద్రంలో బాధితులకు మానసిక మరియు శారీరక చికిత్సలు అందించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా వైద్య అధికారి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కూడా పాల్గొన్నారు. కలెక్టర్ వారితో కలిసి నూతన చికిత్సా కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరికరాలు మరియు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్న వారికి సరైన సమయంలో వైద్యం మరియు కౌన్సెలింగ్ అందించడం ద్వారా వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి ప్రత్యేక విభాగం ఏర్పాటు కావడం జిల్లా ప్రజలకు గొప్ప వరమని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుంటే, మరోవైపు బాధితులకు వైద్యం అందించడంలో వైద్య ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు వివరించారు. ఈ సిక్కు కేంద్రంలో శిక్షణ పొందిన వైద్యులు



మరియు నర్సులు నిరంతరం అందుబాటులో ఉండి బాధితులకు తగిన సూచనలు ఇస్తారని తెలిపారు. ముఖ్యంగా మద్యపానం, గంజాయి వంటి ఇతర వ్యసనాలకు బానిసలైన వారిని గుర్తించి వారికి ఇక్కడ ఉచితంగా చికిత్స అందిస్తారు. ఈ కేంద్రం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రిలో ఇతర విభాగాలను కూడా కలెక్టర్ తనిఖీ చేసి, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, పారిశుద్ధ్య నిర్వహణలో రాజీ పడకూడదని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. మెదక్ జిల్లాలో వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన నిధులు మరియు సిబ్బందిని సమకూర్చుతామని భరోసా ఇచ్చారు. ఈ నూతన చికిత్సా కేంద్రం ఏర్పాటుపై స్థానిక ప్రజలు మరియు రోగుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య అధికారులు మాట్లాడుతూ, వ్యసన విముక్తి కోసం ప్రైవేట్ ఆసుపత్రులలో భారీగా ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా, ఇప్పుడు మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా చికిత్స పొందవచ్చని తెలిపారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ వారికి తగిన కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా కేంద్రంలోనే ఈ సదుపాయం అందుబాటులోకి రావడంతో పరిసర మండలాల ప్రజలకు కూడా ఎంతో మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక మార్పుకు మరియు ప్రజారోగ్యానికి ఈ కేంద్రం ఒక మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073